## కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను


# రద్దు చేయాలి





**కంఠేశ్వర్ -నవభూమి:** కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ను రద్దు చేయాలని కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని, కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక విధానాలను ప్రతిఘటించాలని జాతీయ రాష్ట్ర కార్మిక సంఘాలు స్వాతంత్ర ఫెడరేషన్లు అసోసియేషన్లు పిలుపునిచ్చాయని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ తెలిపారు. ఏ మేరకు శుక్రవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ..కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బిజెపి నాయకత్వంలోని ఎన్డీఎ ప్రభుత్వం తన కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను మరియు కార్పొరేట్ అనుకూల, మతోన్మాద చర్యలను మరింత దూకుడుగా అమలు చేస్తున్నది. కార్మికవర్గం సమరశీల పోరాటాల ద్వారా 100 సంవత్సరాలలో సాధించుకొన్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో 4 లేబర్ కోడ్లను ముందుకు తెచ్చింది. వీటికి వ్యతిరేకంగా గత ఐదేళ్ళుగా కార్మికవర్గం చేస్తున్న ఆందోళనా, పోరాటాలతో లేబర్ కోడ్ల అమలు 5 సం. ఆలస్యమైనా, ఇప్పుడు వాటిని అమలు చేసి కార్మిక కార్మిక హక్కులను పూర్తిగా హరించే ప్రయత్నం చేస్తున్నది. 2025-26 బడ్జెట్లో తమ కార్పొరేట్ అనుకూల విధానాలకు అనుగుణంగా కేటాయింపులు చేసింది. సామాజిక సంక్షేమానికి కోతలు పెట్టింది. సామాన్యులపై భారాలు మోపి, కార్పొరేట్ గుత్త సంస్థలకు, పెట్టుబడిదారులకు వేల కోట్ల రాయితీలు ప్రకటించింది. ప్రభుత్వ విద్య, వైద్యం, గ్రామీణ ఉపాధి హామీ, ఐసిడిఎస్ పథకాలకు వార్షిక బడ్జెట్లలో కోతపెడ్తున్నారు. గత 10 సం౹౹ల కాలంలో రూ.16,35,000 కోట్లు కార్పొరేట్ల పన్ను మాఫీ రూపంలో లబ్ది చేకూర్చారు. కార్పొరేట్ సంస్థలకు ఎన్పీఎ పేరిట బ్యాంక్ రుణాలు వేల కోట్లు రద్దు చేశారు. అంతటితో ఆగకుండ ఉత్పత్తితో లింక్డ్ ఇన్సెంటివ్ పేరున 1.97 లక్షల కోట్లు, పెట్టుబడి ఇన్సెంటివ్గా 97,000 కోట్లు, ఉద్యోగ కల్పన ఇన్సెంటివ్ కోసం రూ.2 లక్షల కోట్లు కేటాయించినా ఒక్క కొత్త ఉద్యోగం రావడంలేదు. ఉత్పత్తి కూడా పెరగకపోవడం శోచనీయం సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న కేంద్ర బిజెపి ప్రభుత్వం ఆ పని చేయకపోగా ఉన్న ఉద్యోగాలకు తీసివేయాలని ప్రయత్నాలు చేస్తుంది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు శంకర్ గౌడ్, ఉపాధ్యక్షులు నన్నేసావ్, సిఐటియు జిల్లా నాయకులు నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఖాకీలపై నిఘా







నవభూమి

నిజామాబాద్

అనుబంధం

10 మే,2025 శనివారం పేజీలు:5

www.epaper.navabhoomi.in


## తొమ్మిది నెలల క్రితమే వివాహం..

# విషాదంలో శ్రీధర్ కుటుంబం





**కామారెడ్డి,-నవభూమి:** కర్రెగుట్ట తండాలో జరిగి ల్యాండ్ మైన్ పేలుడులో కామారెడ్డి జిల్లా పాల్వంచ మండల కేంద్రానికి చెందిన గ్రౌహౌండ్స్ కానిస్టేబుల్ వడ్ల శ్రీధర్ (26) మృతి చెందాడు. శ్రీధర్ మరణవార్త తెలిసి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. శ్రీధర్ మృతితో కుటుంబంలో, గ్రామంలో విషాధ ఛాయలు అలముకున్నాయి. నాలుగు సంవత్సరాల క్రితమే శ్రీధర్ ఉద్యోగంలో చేరాడు. శ్రీధర్‌కు తొమ్మిది నెలల క్రితమే శ్రీవాణితో వివాహం జరిగింది. ఇంతలోనే ఈ ఘటన జరగడంతో గ్రామంలో ప్రతీఒక్కరు కంటతడి పెడుతున్న పరిస్థితి.కాగా.. ములుగు జిల్లా వాజేడు మండలం పెనుగోలు, లంకపల్లి అడవుల్లో తెలంగాణ గ్రేహౌండ్స్ పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తున్న సమయంలో మావోయిస్టులు అమర్చిన ఐఈడీ పేలింది. ఈ పేలుడులో ముగ్గురు గ్రేహౌండ్స్ పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. ఈనెల 7న కూంబింగ్ కోసం పోలీసులు వెళ్లగా నిన్న (గురువారం) తెల్లవారుజామున ఈ పేలుడు సంభవించింది. తెలంగాణకు చెందిన ముగ్గురు గ్రౌహౌండ్స్ పోలీసులు అక్కడికిక్కడే మృతి చెందారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌కు చెందిన సందీప్, రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌కు చెందిన పవన్ కళ్యాణ్, కామారెడ్డి జిల్లా పాల్వంచకు చెందిన శ్రీధర్ ఐఈడీ పేలుడులో ప్రాణాలు కోల్పోయారు. వెంటనే మృతదేహాలను ప్రత్యేక హెలికాప్టర్‌లో ములుగుకు తరలించి.. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. 3 రోజుల పాటు %యూవీ%లు బంద్.. వైరల్ పోస్టుపై పీఐబీ ఫ్యాక్ట్ చెక్..అంతేకాకుండా ఈ పేలుడు అనంతరం భద్రతా దళాలకు మావోయిస్టులకు మధ్యం కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఆర్ఎస్సై రణధీర్ గాయపడగా.. ఆయనను కూడా వెంటనే హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందజేస్తున్నారు. మరణించిన కానిస్టేబుళ్ల మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం హనుమకొండ హెడ్‌క్వార్టర్స్‌కు తరలించారు. మరోవైపు ఈ పేలుడు అనంతరం కూబింగ్ నిర్వహిస్తున్న భద్రతా బలగాలను మావోయిస్టులు తారసపడటంతో ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో మావోయిస్టు కీలక నేతలు హతమయ్యారు. ఎదురుకాల్పుల్లో ఎనిమిది మంది మావోయిస్టులు మరణించగా.. వారిలో మావోయిస్ట్ కేంద్ర కమిటీ సభ్యుడు చంద్రన్న, ఎస్.జెడ్.సీ.మెంబర్ బండి ప్రకాశ్ ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయాన్ని ఇంకా పోలీసులు ధృవీకరించలేదు.

# జాతీయలోక్ అదాలత్‌కు చేయూతనివ్వండి



## బోధన్‌లో ఘనంగా మహారాణా ప్రతాప్ జయంతి వేడుకలు



శక్కర్ నగర్ -నవభూమి: బోధన్ పట్టణంలోని రాకాసి పేటలో శ్రీ సాయి ఆదర్శ యువతి మహిళా మండలి ఆధ్వర్యంలో మహారాణా ప్రతాప్ 486వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళా మండలి అధ్యక్షురాలు పద్మాసింగ్, నాయకులు రాజేందర్ సింగ్ మాట్లాడుతూ మహారాణ ప్రతాప్ 1540 మే 9 రాజస్థాన్లోని చిత్తూరులో ఉదయ్ సింగ్ జయంతి బాయి లకు జన్మించారన్నారు.మహారాణా ప్రతాప్ మేవాడు రాజుగా పాలించాడని, భారత దేశ చరిత్రలో ఆయన సాహసం, శౌర్యం, త్యాగం, బలిదానం భావి స్వాతంత్ర పోరాటానికి ప్రతీకగా నిలిచాయన్నారు. ఆయన మాతృభూమి కోసం ప్రాణాలైనా ఇవ్వడానికి సైనికులను తయారు చేశారన్నారు. యుద్ధంలో తినడానికి తిండి దొరకకపోవడంతో గడ్డి రొట్టెలు తీసుకొని వాటిని తిని యుద్ధంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. ఆయన 1597 జనవరి 9న చావండి వేటలో ప్రమాదంలో గాయాలై మృతి చెందారని, ఆయన సాహసం, స్ఫూర్తి నేటి యువతకు సమాజానికి ఆదర్శమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మదన్ సింగ్, గోపి సింగ్, సంజయ్ సింగ్, విజయ్ సింగ్, అక్షయ్ సింగ్, గీతా సింగ్, రన్వీర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## భారత సైన్యానికి మద్దతుగా శ్రీమారుతి మందిరంలో శక్తి పూజలు



శక్కర్‌నగర్ -నవభూమి: బోధన్ పట్టణంలోని శ్రీ మారుతి మందిరంలో భారత సైన్యానికి మద్దతుగా శక్తి పూజలు నిర్వహించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్, హైదరాబాద్, డిప్యూటీ కమిషనర్, వరంగల్ ఆదేశాల మేరకు ఆలయ అర్చకులు ప్రవీణ్ మహారాజ్ శుక్రవారం పూజా కార్యక్రమం చేపట్టారు. భారత ప్రభుత్వం చేపట్టిన సైనిక్ సింధూర్, సైన్యానికి మద్దతుగా ఈ పూజలు నిర్వహించారు. దేశ సైన్యానికి రక్షణ కల్పించాలని.. వారిలో మరింత ధైర్యం పెంచాలని స్వామివారికి పూజలు జరిపారు. సైనికుల రక్షణ, వారి కుటుంబాలకు మనోధైర్యం కల్పించాలని ఈ సందర్భంగా ప్రార్థించారు. త్వరలోనే దేశం తన సత్తాను చాటి పాకిస్తాన్ కు సరైన గుణపాటం చెబుతుందని పూజా కార్యక్రమాలకు హాజరైన పలువురు పెద్దలు అన్నారు. ప్రశాంతంగా ఉన్న భారతదేశంలో కొరివితో తల గోకినట్టు చేసి యుద్ధ వాతావరణం సృష్టించారని పాకిస్తాన్ కు ఏ దేశాలు మద్దతు పలకొవద్దని భక్తులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ప్రవీణ్, మహారాజ్, భక్తులు, పెద్దలు పాల్గొన్నారు.

## భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తత

మోర్తాడ్,-నవభూమి: బాల్కొండ నియోజకవర్గంలో నేడు జరగనున్న అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ, అధికారిక కార్యక్రమాలను భారత్–పాకిస్థాన్ సరిహద్దుల్లో ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో వాయిదా వేశామని, తదుపరి తేదీని మళ్లీ ప్రకటిస్తామని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు కాల్పులు జరిపి, సామాన్యులను బలితీసుకున్న నేపథ్యంలో భారత సైన్యం పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసి ఉగ్రవాదులను మట్టుబెట్టిన సంగతి తెలిసిందేనని పేర్కొన్నారు. ఒక భారతీయుడిగా ఈ చర్యను సమర్థిస్తూ గర్విస్తున్నట్లు పేర్కొన్నారు.ఉగ్రవాదాన్ని ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించేది లేదనే సందేశం ఇస్తూ, భారత సైన్యం వీరోచిత పోరాటాన్ని యావత్ భారతావని అభినందిస్తున్నదని తెలిపారు. ఉగ్రవాదం పై భారత సైన్యం చేస్తున్న పోరులో పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అందరం ఏకమై మద్దతుగా నిలబడాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.

# ఖాకీలపై నిఘా..!



నిజామాబాద్, -నవభూమి: శాంతిభద్రతలను కాపాడుతూ సమాజ రక్షణ కోసం నిరంతరం పనిచేస్తున్న పోలీసులు అపఖ్యాతి మూటగట్టుకుంటున్నారు. కొంతమంది పోలీసుల తీరు తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్, కామారెడ్డి జిల్లా పోలీసుశాఖలో తాజాగా వెలుగుచూస్తున్న ఘటనలు చర్చనీయాంశంగా మారాయి. వక్రదారిపడుతున్న ఖాకీలపై పోలీస్‌బాసులు వేటు వేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మార్పు కనిపించడం లేదు. ఎవరో ఒకరు, ఎక్కడో ఒక చోట ఆమ్యామ్యాలకు ఆశ పడుతూనే ఉన్నారు.నిబంధనలకు విరుద్ధంగా పోలీస్‌స్టేషన్‌లను సెటిల్మెంట్లకు అడ్డాగా చేసుకుని దర్జాగా డబ్బులు సంపాదిస్తున్నారు. వారిని నిలువరించేవారే కరువయ్యారు. కామారెడ్డి జిల్లాలో ఇటీవల తాడ్వాయి ఎస్సైని సస్పెండ్ చేశారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించడంపై ఎస్పీ రాజేశ్ చంద్ర సమర్పించిన నివేదిక ఆధారంగా ఐజీ చర్యలు తీసుకున్నారు.ఇదే ఠాణాలో పలు భూ దందాలు భారీగా జరిగినట్లుగా ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఓ రిటైర్డ్ పోలీస్ అధికారికి సంబంధించిన కుటుంబీకుల వ్యవహారంలో స్థానిక ఎస్సై తలదూర్చి చిత్రహింసలకు గురి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. సివిల్ తగాదాల్లో వేలు పెట్టొద్దంటూ పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలున్నప్పటికీ కింది స్థాయిలో కొంత మంది బేఖాతరు చేస్తున్నారు.టాస్క్‌ఫోర్స్ నుంచి ట్రాఫిక్ వరకు..నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో టాస్క్‌ఫోర్స్ విభాగంపై అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి. ఓ ఏసీపీ స్థాయి అధికారి తీరుతో ఖాకీల పరువు కూడా బజారున పడింది. సంఘ విద్రోహ శక్తుల ఆట కట్టించే టాస్క్‌ఫోర్స్‌లో ఉన్నతాధికారులు, కింది స్థాయి వ్యక్తులు కలిసి అక్రమ దందాకు తెర లేపారు. ఈ వ్యవహారంపై 'నమస్తే తెలంగాణ'లో వరుస కథనాలు రావడంతో నాటి సీపీ కల్మేశ్వర్ స్పందించారు. విచారణ చేసి వాస్తవాలు నిగ్గు తేల్చారు. డీజీపీకి నివేదిక సమర్పించగా గతేడాది అక్టోబర్‌లో ఏసీపీని సస్పెండ్ చేశారు.ఏసీపీ స్థాయి వ్యక్తిని అవినీతి ఆరోపణలతో సస్పెండ్ చేయడంతో కమిషనరేట్‌లో మార్పు వస్తుందని అంతా అనుకున్నారు. కానీ ట్రాఫిక్ విభాగంలోనూ అంతులేని దందా కనిపిస్తోంది. నిత్యం రోడ్లపై సామాన్యులను హెల్మెట్ పేరుతో జరిమానాలు విధించే ట్రాఫిక్ విభాగం పోలీసులే కొంత మంది వ్యాపార, వాణిజ్య వర్గాలను టార్గెట్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు.ఇందులో భాగంగానే ఏసీపీపై వచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఉన్నతాధికారులు విచారణ చేపట్టి వేటు వేశారు. అతితక్కువ కాలంలోనే ఇద్దరు ఏసీపీలు అవినీతి ఆరోపణలతో సస్పెండ్ కావడం తీవ్ర దుమారం రేపుతోంది. ఈ ఏడాది జనవరిలోనే భీమ్‌గల్ పోలీస్ స్టేషన్‌లో సివిల్ పంచాయి తీలు, మధ్యవర్తుల దందాపై ఫోకస్ పెట్టి ఓ సీఐ, ఎస్సైపై వేటు వేశారు. వారం క్రితం ఆర్ఓ ఠాణా పరిధిలో ఓ హెడ్ కానిస్టేబుల్ విధుల్లో నిర్లక్ష్యం వహించడంతో సీపీ చర్యలు తీసుకున్నారు. అక్రమాలకు తోడుగా బహిరంగంగానే లం చం తీసుకుంటూ ఎస్సైలు ఏసీబీకి చిక్కుతున్నారు. వర్ని, లింగంపేట మండలాల్లో వరుసగా నెలల వ్యవధిలోనే ముగ్గురు ఎస్సైలు పట్టుబడడం గమనార్హం.వేటు వేస్తున్నా..కానరాని మార్పు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు సీపీగా సాయి చైతన్య, ఎస్పీగా రాజేశ్ చంద్ర వచ్చిన తర్వాత పలువురు పోలీసులపై వేటు పడింది. విధుల్లో నిర్లక్ష్యం, అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. అయినప్పటికీ మార్పు మాత్రం కానరావడం లేదు. సీపీ, ఎస్పీలు ఇద్దరూ నిరంతరం ఫీల్డ్ విజిట్‌లకు వెళ్తున్నారు. ఈ సమయంలోనే పోలీస్ స్టేషన్లలో స్థితిగతులను ఓ కంట కనిపెట్టి చర్యలకు శ్రీకారం చుడుతున్నారు.హనుమాన్ జయంతి సమయంలో తాడ్వాయి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ రాజేశ్ చంద్ర ఆ తర్వాత సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్‌పై చర్యలకు సిఫార్సు చేశారు. తదనంతరం ఎస్సై సస్పెండ్ అయ్యారు. రామారెడ్డి ఠాణాలో ఓ హత్య కేసులో లోతైన దర్యాప్తు చేయడంలో ఎస్సై నిర్లక్ష్యం వహించాడు. అనేక అనుమానాలు ఉన్నప్పటికీ ఆధారాల సేకరణపై ఆసక్తి చూపలేదు. హంతకులను గాలికి వదిలేయడంతో బాధిత కుటుంబాల్లో ఆందోళన మొదలైంది.హత్యను అనుమానాస్పద మృతిగానే పోలీసులు కొనసాగిస్తుండడంతో బాధిత కుటుంబం ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేయగా అసలు గుట్టు రట్టయ్యింది. భార్యనే భర్తను చంపి నాటకం ఆడినట్లుగా తేలడంతో ఎస్సైపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. పాస్‌పోర్ట్ జారీలో పోలీసుల విచారణ కీలకం. స్పెషల్



బ్రాంచ్ పోలీసులు ఇందులో ముఖ్య పాత్ర పోషిస్తారు. ప్రాథమిక విచారణలో ఓ కానిస్టేబుల్ నిర్లక్ష్యం చూపడంతో ఎస్పీ రాజేశ్ చంద్ర దృష్టి సారించగా.. సదరు కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ డీఐజీ ఉత్తర్వులిచ్చారు.సవాళ్లు గాలికి వదిలేసి..ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పోలీసులను అనేక సవాళ్లు వెంటాడుతున్నాయి. తరచూ దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లతో పాటు హత్యలు, లైంగిక దాడి ఘటనలు అనేకం వెలుగు చూస్తున్నాయి. వీటికి తోడు రోడ్డు ప్రమాదాలు పెద్దసంఖ్యలో జరుగుతున్నాయి. గంజాయి సరఫరా, వినియోగం భారీగా పెరిగింది. కల్తీ కల్లు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. ఇందులో ఆల్ప్రాజోలం భారీగా వినియోగిస్తున్నారు. మత్తుపదార్థాల దందా రోజురోజుకూ గ్రామీణ ప్రాంతాలకు సైతం వ్యాప్తి చెందుతున్నది. పోక్సో కేసులు సైతం పెరుగుతున్నాయి. పట్టపగలే తాళాలు పగులగొట్టి చోరీలు చేస్తున్న ఘటనలతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు.ఆందోళన కలిగిస్తున్న నేరాలు,ఘోరాలు నేరాలు, ఘోరాలు పెరిగిపోతుండడం ఆందోళన కలిగిస్తున్నది. ఈ నేపథ్యంలో పోలీసులు బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉన్నది. నేరారోపిత, నేరాల్లో సాంకేతికతను వినియోగించి దర్యాప్తును పకడ్బందీగా నిర్వహించి అక్రమార్కులను పట్టుకోవాలి. క్షేత్ర స్థాయిలో కొంతమంది ఈ సవాళ్లను గాలికి వదిలేసి జేబులు నింపుకొనేందుకు ఎగబడుతున్నారు. ఇందుకోసం ఇసుక వ్యాపారులతో ములాఖత్ అవుతూ దందా కొనసాగిస్తున్నారు. అధికార పార్టీ నేతల మెప్పును దక్కించుకుంటూ పోస్టింగ్‌ను కాపాడుకుంటున్నారు.విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన కానిస్టేబుళ్లను ఉన్నతాధికారులు సులువుగా సస్పెండ్ చేస్తున్నారు. బాన్సువాడ, జుక్కల్, బోధన్ నియోజకవర్గాల్లోని మంజీరా పరీవాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమాల్లో కొంతమంది పోలీస్ అధికారులు నేరుగా పాత్రధారులుగా మారుతున్నారని ఆరోపణలు గుప్పుమంటుండగా ఇప్పటివరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఏండ్లుగా ఒకే చోట పోస్టింగ్‌లో స్థిరత్వం దక్కించుకుని అన్నీ తామై వ్యవహరిస్తున్న ఖాకీలపై నిఘా కూడా కరువైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## జాతీయలోక్ అదాలత్‌కు చేయూతనివ్వండి

వినాయక్‌నగర్,-నవభూమి: జిల్లా వ్యాప్తంగా జూన్ 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడానికి చేయూతనివ్వాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్ పర్సన్ జీవీఎన్ భరత లక్ష్మి కోరారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని సమావేశపు హాల్‌లో అదనపు జిల్లా జడ్జి హరీశ్, న్యాయసేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఉదయ భాస్కర్, అధికారులు, న్యాయవాదులతో గురువా రం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు.రోడ్డు ప్రమాదం కేసుల్లో నష్ట పరిహారం కోసం దావాలకు తుదిరూపం తీసుకురావడానికి చేదోడుగా నిలుస్తామన్నారు. సమావేశంలో ప్రభుత్వ బీమా కంపెనీల న్యాయవాదులు గోవర్ధన్, ఆనంద్, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ పాల్గొన్నారు.



# 130 మొబైల్ ఫోన్ల రికవరీ



**కామారెడ్డి:-నవభూమి:** సెల్ ఫోన్ పోయినా.. చోరీకి గురైనా.. ఆందోళన చెందవద్దని, సిఈఐఆర్ఎఫ్ ద్వారా తిరిగి పొందవచ్చని జిల్లా ఎస్పీ శుక్రవారం అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లాలో వివిధ చోట్ల పోగొట్టుకున్న, చోరీకి గురైన 130 మొబైల్ ఫోన్లను ( సుమారు రూ.20 లక్షల విలువగల) స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించడం జరుగుతుంది అని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోయిన సెల్ ఫోన్ పట్ల అశ్రద్ధ చేస్తే ఇది వ్యక్తిగత, సామాజిక భద్రతకు భంగం కలుగుతుందన్నారు. మొబైల్ పోయిన లేదా చోరీకి గురైన వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్ కు వెళ్లి దరఖాస్తు ఇవ్వాలనీ, సిమ్ కార్డ్ బ్లాక్ చేసి అదే నంబరు గల కొత్త సిమ్ తీసుకోవాలి. తద్వారా పోయిన మొబైల్ ఫోన్ల ఐఎంఈఐ వివరాలు సిఈఐఆర్ వెబ్సైట్ లో బ్లాక్ చేయడం వలన పోగొట్టుకున్న మొబైల్ సులభంగా దొరికే అవకాశం ఉన్నదన్నారు. జిల్లా పోలీసు కార్యాలయములో పోయిన సెల్ ఫోన్ల రికవరీ కోసం ఇన్స్పెక్టర్ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఒక ఆర్ఎస్ఐ , 10 మంది కానిస్టేబుల్స్ తో ప్రత్యేక టీం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. గత (3) రోజులలో ఈ టీం అధికారులు 130 ఫోన్ లను రికవరీ చేయడం జరిగింది అన్నారు. ఈ సందర్భంగా 130 మొబైల్ ఫోన్ల రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన టీం సభ్యుల అందరినీ జిల్లా ఎస్పీ అభినందించడం జరిగింది. ఇప్పటి వరకు రికవరీ చేసిన ఫోన్ల వివరాలను బాధితులకు తెలిజేయడం జరుగుతుంది. వారు జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి ఆర్ ఎస్ ఐ బాలరాజ్ ని సంప్రదించి (8712686114) ఫోన్ కు సంభందించిన వివరాలు చూపించి తమ తమ ఫోన్లను తీసుకోవాలన్నారు.

## కోటగిరి ఎస్సై సునీల్‌కు బీఆర్ఎస్ నాయకులచే సన్మానం



**కోటగిరి -నవభూమి:** నిజామాబాద్ జిల్లా కోటగిరి కి బదిలీ పై వచ్చిన ఎస్సై సునీల్ ను పాతంగల్ మండలం జల్లాపల్లి అబాది బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై సునీల్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరీఫ్, ఏజాస్, షాదుల్, సద్దాం, ఫెరోస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీధర్ కుటుంబానికి అండగా ఉంటాం:మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



**కామారెడ్డి-నవభూమి:** పోలీసు వడ్ల శ్రీధర్ అంత్యక్రియల్లో పాల్గొనడానికి శుక్రవారం పాల్వంచకు వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వడ్ల శ్రీధర్ కుటుంబానికి అండగా నిలుస్తామన్నారు. చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని, హింసా మార్గాన్ని విడనాడాలని ఆయన అన్నారు. మరణించిన శ్రీధర్ కుటుంబానికి రూ.2.17 కోట్ల ఆర్థిక సాయం ప్రభుత్వం నుండి అందనున్నట్లు తెలిపారు.తొలుత శ్రీధర్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వ పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎల్లారెడ్డి శాసన సభ్యులు మదన్ మోహన్ రావు, కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఎస్పీ రాజేష్ పార్థివ దేహం పై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీసు గౌరవ వందనం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రేహౌండ్స్ కమాండర్ ఆపరేషన్ రాఘవేందర్ రెడ్డి, ఓఎస్‌డీ దయానంద్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, డీఎస్పీ శంకరయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, అదనపు కలెక్టర్ రెవిన్యూ వీ విక్టర్, ఆర్డీవో వీణ, పోలీసు, రెవిన్యూ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యాసంస్థల్లో అడ్మిషన్లు పెంచాలి

**ఖలీల్‌వాడి,-నవభూమి:** ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లో అడ్మిషన్లను పెంచడంతోపాటు త్వరలో నిర్వహించనున్న అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు జిల్లాలోని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాళు , హెడ్మాస్టర్లు కృషి చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశపు హాలులో జిల్లా ఇంటర్ విద్యాధికారి అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమీక్షలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ మాట్లాడుతూ ..ప్రస్తుతం సప్లిమెంటరీ పరీక్షలకు 15 రోజుల ప్రణాళిక ద్వారా వంద శాతం ఫలితాలను సాధించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల డ్రైవ్ కొనసాగుతుందని తెలిపారు. ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ హాస్టళ్లలో కనీసం 20 శాతం సీట్లను కేటాయించాలని కోరారు. కొన్ని గ్రామాలకు ఇప్పటికీ ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదని, మాలు మారుమూల గ్రామీణ ప్రాంతాలకు బస్సులు నడిపితే అడ్మిషన్ల సంఖ్య పెరుగుతుందని తెలిపారు.

# వరల్డ్ లూపస్ డే సందర్భంగా 2కే రన్



**కంఠేశ్వర్:-నవభూమి:** వరల్డ్ లూపస్ డే సందర్భంగా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం 2కే రన్ నిర్వహించనున్నట్లు ఉత్తర తెలంగాణలో మొట్టమొదటి రుమటాలజిస్ట్, నిజామాబాద్ రుమటాలజీ, ఆర్థరైటిస్ సెంటర్ వైద్యురాలు గ్రీష్మ, ప్రముఖ కార్డియాలజిస్ట్ రవి కిరణ్ తెలిపారు. నగరంలోని నిజామాబాద్ రుమటాలజీ, ఆర్థరైటిస్ సెంటర్ లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కీళ్లవాతం(ఆర్థరైటిస్)లో లూపస్ అనేది ప్రమాదకరమైనదని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 2కే రన్ నిర్వహిస్తున్నామన్నారు. లూపస్ అనేది ప్రాణాంతకమైనది కాకున్నప్పటికీ రోగనిరోధక శక్తిని దెబ్బ తీస్తుందని, పర్యావసనంగా అవయవాలపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. కిడ్నీ, ఊపిరితిత్తులు, కళ్ళు, చర్మం తదితర అవయవాలపై ప్రభావం చూపుతుందన్నారు. లూపస్ అనేది వంశపారంపర్యంగా వచ్చే వ్యాధి అని, ఈ వ్యాధి బారిన పడినవారిలో దీర్ఘకాలిక జ్వరం, కారణం లేకుండా జ్వరం రావడం, రక్తహీనత, శరీరంలో హిమోగ్లోబిన్ శాతం తగ్గుతుందని తెలిపారు. అలసట, ముఖంపై దద్దుర్లు వంటి తదితర లక్షణాలు కనిపిస్తాయని వివరించారు. వంశపారంపర్యంగా వచ్చే వ్యాధి ఎక్కువగా 15 ఏళ్ల నుంచి 40 వయస్సు ఆడవారిలో కనిపిస్తుందన్నారు. 2కే రన్ కు ముఖ్య అతిథులుగా ఐఎంఏ అధ్యక్షుడు అజ్జ శ్రీనివాస్, సెక్రెటరీ విక్రమ్ రెడ్డి, ట్రెజరర్ రాజేందర్, వైద్యులు హాజరవుతారని, నగర ప్రముఖులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.రుమటాలజిస్ట్ ను వీరు కలవాల్సిందే.. దీర్ఘకాలంగా కీళ్ల నొప్పులు, జ్వరంతో బాధపడుతున్న వారు, యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉన్న వారు, రుమటాయిడ్, సోరియాటిక్, ఇది వరకు ఆర్థరైటిస్ కు చికిత్స పొందిన వారు రుమటాలజిస్ట్ ను కలవాల్సిందేనని వైద్యురాలు గ్రీష్మ తెలిపారు. ఎముకలు, నరాల డాక్టర్లు, ఆన్ లైన్ సర్టిఫికెట్ కోర్సు చేసిన వారు రుమటాలజిస్ట్ లు కారని స్పష్టం చేశారు. ఎండీ జనరల్ మెడిసిన్(ఫిజిషియన్) పూర్తి చేసి మూడేళ్ల డీఎం సూపర్ స్పెషాలిటీ పూర్తి చేసిన వారు మాత్రమే రుమటాలజిస్ట్ లు అని గ్రీష్మ స్పష్టం చేశారు.

## ప్రజల్లో వ్యతిరేకతను జీర్ణించుకోలేకే ఎమ్మెల్యేపై ఆరోపణలు

**కమ్మర్ పల్లి -నవభూమి:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజల్లో రోజురోజుకు పెరుగుతున్న వ్యతిరేకతను జీవించుకోలేక కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర మాజీ మంత్రి ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి పై అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని బిఆర్ఎస్ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్ అన్నారు. ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి పై కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి మాట్లాడిన తీరు చూస్తుంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని టిఆర్ఎస్ పార్టీ మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్థానిక విలేకరుల సమావేశంలో దేవేందర్ మాట్లాడారు.ఎన్నికలకు ముందు ఆనాటి పీసీసీ అధ్యక్షులు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణలో అధికారులకు వస్తే అన్ని డబ్బులు చేస్తామని అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారన్నారు. ఈరోజు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని కుంటి సాకులు చెబుతూ ఇచ్చిన హామీలకు ఎగనామం పెట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శతవిధాల ప్రయత్నం చేస్తున్నాడని విమర్శించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేని కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజల్లో రోజురోజుకు విశ్వాసం సన్నగిల్లుతుందన్నారు. ప్రజల్లో వ్యతిరేకతను జీర్ణించుకోలేక కాంగ్రెస్ నాయకులు బిఆర్ఎస్ నాయకులపై అడ్డగోలు ఆరోపణలు చేస్తూ కాలం వెళ్లబుచ్చుతున్నారని ఆరోపించారు. గత పది సంవత్సరాలలో రాష్ట్ర మాజీ మంత్రి ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసి బాల్కొండ ప్రజల మన్ననలు పొందాడన్నారు. ప్రజలు ప్రశాంత్ రెడ్డి పాలనను మెచ్చి హ్యాట్రిక్ విజయాన్ని అందించారనే కాంగ్రెస్ నాయకులు గుర్తుంచుకోవాలన్నారు. ప్రశాంత్ రెడ్డి ఎమ్మెల్యేగా ప్రజల తరపున, రైతుల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నించడంతో సమాధానం చెప్పలేక కాంగ్రెస్ నాయకులు అసత్య ఆరోపణలతో ఎదురుదాడికి దిగడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బిఆర్ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరిచే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అడుగున నిలదీస్తూనే ఉంటామన్నారు. ఈ సమావేశంలో చౌటపల్లి సింగిల్ విండో చైర్మన్ కుంట ప్రతాప్ రెడ్డి, మాజీ సర్పంచ్ గడ్డం స్వామి, బిఆర్ఎస్ రైతు విభాగం మండల అధ్యక్షులు బద్దం రాజశేఖర్, టిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు కొంటికంటి నరేందర్, పాలెపు రవి కిరణ్, సంత రాజేశ్వర్, నోముల నరేందర్, గోపిడి లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## కానిస్టేబుల్ కుటుంబాన్ని ఆదుకుంటాం: మంత్రి పొన్నం




**కామారెడ్డి -నవభూమి:** విధి నిర్వహణలో మరణించిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ వడ్ల శ్రీధర్ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని రాష్ట్ర రవాణా, బి.సి.సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పాల్వంచ మండల కేంద్రానికి చెందిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ వడ్ల శ్రీధర్ అంత్యక్రియల్లో పాల్గొనడానికి మంత్రి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వడ్ల శ్రీధర్ కుటుంబానికి అండగా నిలుస్తామని తెలిపారు. చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని, హింస మార్గాన్ని వీడనాడాలని ఆయన అన్నారు. మరణించిన శ్రీధర్ కుటుంబానికి రూ.2.17 కోట్ల ఆర్థిక సహాయం ప్రభుత్వం నుండి అందజేయ బడుతుందని తెలిపారు. తొలుత శ్రీధర్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వ పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు జరుపుతామని తెలిపారు. అనంతరం ఎంపీ సురేష్ షెట్కర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, శాసన సభ్యులు మదన్ మోహన్ రావు, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఎస్పీ రాజేష్ లు పార్థివ దేహం పై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తర్వాత పోలీసు గౌరవ వందనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రేహ్యాండ్ కమాండర్ ఆపరేషన్ రాఘవెందర్ రెడ్డి, ఓ ఎస్ డి దయానంద్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, డీఎస్పీ శంకరయ్య, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, అదనపు కలెక్టర్ రెవిన్యూ వి.విక్టర్, ఆర్డీఓ వీణ, పోలీసు, రెవిన్యూ, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జక్రాన్ పల్లిలో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు

**జక్రాన్ పల్లి -నవభూమి:** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ వారు చేపట్టిన " రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు" కార్యక్రమం జక్రాన్ పల్లి మండల కేంద్రంలో నిర్వహించారు. స్థానిక రైతు వేదికలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రైతు నాయకుడు, వ్యవసాయ విశ్వవిద్యాలయం సలహా మండలి సభ్యుడు కోటపాటి నరసింహం నాయుడు పాల్గొని వ్యవసాయదారులు అధిక దిగుబడి నిచ్చే నూతన వంగడాలు, పురుగు మందులు, రసాయన ఎరువులు వాడకంలో మెలకువలు, పంటల మార్పిడి వ్యవసాయ రంగంలో వస్తున్న పరిశోధన ఫలాలు అందిపుచ్చుకొని సంవృద్ధిని ఏ విధంగా సాధించాలో వివరించారు. మన జిల్లాలోని తోట భూములు పామాయిల్ సాగుకు ఎంతో అనుకూలంగా ఉన్నాయి. కాబట్టి పామాయిల్ సాగు చేస్తూ దానిలో అంతర పంటలు పసుపు, సోయా మరియు మొక్కజొన్న పంటలు సాగు చేయడం ద్వారా అధిక లాభాలు సాధించవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు సాయి చరణ్, శ్రీమతి ప్రశాంతి , మండల వ్యవసాయ అధికారి శ్రీమతి దేవిక , కృషి విజ్ఞాన్ కేంద్రం వ్యవసాయ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో పాటు స్థానిక రైతులు, సొసైటీ చైర్మన్ గంగారెడ్డి పాల్గొన్నారు.



### బాధితురాలిని పరామర్శించిన

# ఐద్వా నాయకులు

**కంఠేశ్వర్ -నవభూమి:** మహిళలపై పెరుగుతున్న హింస నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో హింసకు గురై అడ్మిట్ అయిన మహిళను ఐద్వా నాయకులు గురువారం పరామర్శించారు. వినాయక్ నగర్ నివాసి బి లక్ష్మినీ భర్త తడిక శ్రీకాంత్ అత్త శోభ, మరిది హరికాంత్,లు విపరీతంగా కొట్టి పడేసి వెళ్లిపోయారు. అక్కడే ఉన్న అపార్ట్మెంట్ వాసులు లక్ష్మి తల్లికి ఫోన్ చేసి మీ కూతురు స్పృహ కోల్పోయి పడిపోయింది అని అని లక్ష్మి తల్లి చెప్పారు. ఐద్వా నాయకులతో లక్ష్మీ మాట్లాడుతూ.. తన భర్త శ్రీకాంత్ తో వివాహం జరిగి 8 సంవత్సరాలుగా నరకం అనుభవిస్తున్నానని, తనకి మహిళలపై వ్యామోహం ఎక్కువ. పెళ్లిళ్లు చేసుకుంటూ మూడు సంవత్సరాలు నాలుగు సంవత్సరాలు కాపురం చేసి ఆ తర్వాత చిత్రహింసకు గురిచేసి, వారంతర వారే వెళ్ళిపోయే విధంగా అత్త మరిది మొగుడు ప్రవర్తిస్తారని, ప్రతి చిన్న విషయంలో మరిది కలగచేసుకుని మొగుడి కంటే ముందు తానే బూతులు మాట్లాడుతూ.. చేయి చేస్తాడు. అందుకు పూర్తి మద్దతు భర్త అత్త మరిదికే సపోర్ట్ చేస్తారు. అలాగే ఇంట్లో దాదాపు 8 కెమెరాలు చుట్టూ ఉన్నాయని తెలిపింది. రోడ్డుపై నుంచి బెడ్ రూమ్లో కూడా కవరయ్యే విధంగా ఆ కెమెరాలు ఉన్నాయని, తన ఇంటికి ఏ చుట్టాలు వచ్చి అనుమానిస్తూ తనపై నిందలు వేస్తాడని తెలిపారు. దాదాపు 8 సంవత్సరాలుగా ఇదే నరకం చూపిస్తున్నారని, సొంత తమ్ముడు ఇంటికి వచ్చిన అక్రమ సంబంధం అంట కడుతూ తను ఎక్కడికైనా మార్కెట్ కి వెళ్లి వచ్చిన ఇంట్లోకి రాగానే బెడ్ రూమ్ లోకి తీసుకువెళ్లి బాడీ మొత్తం చెక్ చేస్తారు. ఎవరితో పడుకొని వచ్చావో చెప్పు అంటూ కొట్టడం స్టార్ట్ చేస్తాడని, ఈ ఎనిమిది సంవత్సరాల కాలంలో 5 అబార్షన్లు చేపించి, ఒక రకమైన హింసకు గురి చేశాడని తెలిపింది. ఈ ఇద్దరు పిల్లలు కూడా లక్ష్మీ తల్లి అమ్మాయి అనారోగ్య పాలవుతున్నది కాబట్టి మీరు అబార్షన్ చేయించడం కరెక్ట్ కాదు అని వాదించడం వల్లనే ఇద్దరు పిల్లలు పుట్టారని, ఒకవేళ పిల్లలు వద్దు అని అంటే ఇష్టం లేకపోతే ఫ్యామిలీ ప్లానింగ్ చేయించుకుంటా అని చెప్పితే, నువ్వు ఎవరితో ఉంటున్నావో నాకు ఎలా తెలుస్తది. కాబట్టి నువ్వు ఫ్యామిలీ ప్లానింగ్ చేయించుకోకూడదు అని ఆంక్షలు పెట్టి హింసించేవాడని తెలిపింది.అలాగే కిరణ్ మై మెడికల్ ఏజెన్సీ కి కూడా తన దగ్గర నుండి 5 లక్షల రూపాయలు రెండు తులాల బంగారం ఏజెన్సీ కి పెట్టాడు అని అయితే శ్రీకాంత్ కి తనకంటే ముందు మూడు వివాహాలు జరిగినట్టు లక్ష్మీ చెప్పింది. అందులో మొదటి భార్య సూసైడ్ చేసుకుని చనిపోయిందని మరో ఇద్దరు



విడాకులు ఇచ్చి వెళ్లిపోయారని ఇప్పుడు ఈమెను కూడా ఏదో రకంగా వదిలించుకోవడం కోసమే ఇదంతా కుట్ర చేస్తున్నారు. ఎందుకంటే ఈమధ్య కాలంలోనే ఇంకో కొత్త అమ్మాయితో రిలేషన్ షిప్ లో ఉంటూ ఈమెపై ఇంకా కక్ష పెంచుకుంటున్నాడు. లక్ష్మికి అనుమానం వచ్చి మెడికల్ షాప్ కి వెళ్లి చూడగా అసలు విషయం తెలిసింది. ఇప్పుడు కూడా తను నాలుగో నెల గర్భవతి అని చెప్పింది. కడుపులో గట్టిగా దెబ్బలు తగలడం వల్ల రక్తస్రావం ఎక్కువగా అయితుంది. ప్రెగ్నెన్సీ ఉంటదో పోతదో తెలవదు అని డాక్టర్లు చెప్పడం జరిగింది. కాబట్టి నాకు నా పిల్లలకు రక్షణ కల్పించాలని నాకు న్యాయం చేయండి అని మీ సపోర్టు కావాలని కోరుతూ ఐద్వా నాయకులకు తన గోడు వెళ్ళబోసుకుంది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సుజాత మాట్లాడుతూ.. ఇలాంటి వారికి కఠినమైన శిక్షలు పడాలి. లేదంటే మహిళల జీవితాలతో ఆడుకుంటూ సమాజంలో మగవారు అంటేనే విరక్తి పుట్టేలా ఇలాంటి కీచకులు చేస్తున్న పనికి సరైన పనిష్మెంట్ జరగకపోతే రేపు రానున్న రోజుల్లో ఇంకా విచ్చలవిడిగా హింస పెరిగిపోతుంది అని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి శ్రీకాంత్ కి జీవిత ఖైదు శిక్ష వేసి బయటకు రాకుండా చేయాలి. అతనిపై ఉన్న కేసులు వెనక్కి తీసి కఠినంగా శిక్షించాలి అని డిమాండ్ చేశారు. లేదంటే వాడిని జైలుకు పంపేంత వరకు ఆందోళన కార్యక్రమాలు చేస్తామని, ఆ అమ్మాయికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు అనిత, జిల్లా కమిటీ సభ్యులు కళా స్వప్న పాల్గొన్నారు.

# అవగాహన సాగుతో అధిక దిగుబడులు

**ముధోల్:-నవభూమి:** వ్యవసాయంపై అవగాహనతో పంటల సాగులో నాణ్యమైన ఉత్పత్తులను,అధిక దిగుబడులు సాధించవచ్చని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆదేశానుసారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలం లోని వెంకటా పూర్ గ్రామంలో గురువారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు తప్పనిసరిగా మట్టి నమూనా పరీక్ష లు చేయించుకోవాలని సూచించారు సేంద్రియ ఎరువులతోని అధిక దిగులు సాధించవచ్చని పేర్కొన్నారు అధిక యూరియా వాడుతున్నారని దీంతో భూమి సారం కోల్పోతుందని అన్నారు. కెపాసిటీ మించి రసాయన ఎరువులు వాడకూడదని శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన సలహా సూచనలు పాటిస్తూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాదించాలని అన్నారు. సేంద్రియ ఎరువులు వాడటం వలన భూసారం పెరగడంతో పాటు రైతుకు ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తాయని పేర్కొంన్నారు. అలాగే ఏరువాక ,వ్యవసాయ పరిశోధనా స్థానం ముధోల్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నర్సయ్య మాట్లాడుతూ రైతులు భూమిని కాపాడాలని పేర్కొన్నారు. ఎక్కువ రసాయన ఎరువులతో పాటు యూరియా వలన భూమిలోని సారమంత కోల్పోయి నిర్జీవంగా మారుతుందని దీంతో దిగుబడులు తగ్గుతాయని చెప్పారు. ప్రతి ఒక్కరు తాము సూచించిన సలహా సూచన లు పాటిస్తూ అధిక దిగుబడును పొందాలని ఉద్దేశంతోనే ప్రభుత్వం భృహత్తర కార్యక్రమం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలన్నే కార్యక్రమం శ్రీకారం చుట్టిందని అన్నారు శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, డిఎఓ అంజిప్రసాద్,ఆర్టికల్చర్ జిల్లా అధికారి రమణ,ఎడిఎ వినయ్ బాబు,శాస్త్రవేత్తలు డా.విజయ్ కుమార్,డా.కార్తీక్,జావిద్ బాషా, నాయకులు నర్సగౌడ్, కోరి పోతన్న,టి రమేష్,దేవోజి భూమేష్,సురేందర్ రెడ్డి,సాయినాథ్,రామ్ నాథ్, రైతులు తదితరులు, పాల్గొన్నారు.



## బైక్ దొంగ అరెస్టు



**మోపాల్ -నవభూమి:** నిజామాబాద్ నాలుగో టౌన్ పరిధిలోని రోటరీ నగర్ నుండి రాత్రి సమయంలో నవీన్ అనే వ్యక్తి బైక్ దొంగిలించాడు. అదే రోజు రాత్రి మోపాల్ మండలంలోని మంచిప్ప గ్రామ శివారులోని ఒక గుడిలో, ముదక్పల్లి గ్రామంలో గల ఒక గుడిలో హుండీ నీ దొంగలించాడు. మళ్ళీ అదే గ్రామంలో గుడి పక్కన గల ఇంటి ఆవరణలో మరో బైక్ ని అపహరించాడు. నేరస్థుడు నవీన్(27) గతంలోనూ దొంగతనాలు చేసి పట్టుబడి, మూడేండ్ల జైలు జీవితం కూడా గడిపాడని తెలిసింది. విడుదలయ్యాక విలాసం కోసం మళ్లీ దొంగతనాలను చేస్తున్నట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి దొంగను పట్టుకున్న ఎస్సై యాదగిరి గౌడ్, ఎస్ఐ రమేష్, హెడ్ కానిస్టేబుల్ సామ్యూల్, నిజామాబాద్ ఉన్నత అధికారులు, సిఐ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

## నగరంలోని రద్దీ ప్రదేశాల్లో డాగ్స్ స్క్వాడ్



**కంఠేశ్వర్-నవభూమి:** నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలోని బస్టాండ్, రైల్వే స్టేషన్, ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంతాలలో డాగ్స్ స్క్వాడ్ తనిఖీలు గురువారం రాత్రి నిర్వహించడం జరిగిందని ఒకటవ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ రఘుపతి శుక్రవారం తెలిపారు. తమ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో అనుమానాస్పదంగా తిరుగుతున్నటువంటి వ్యక్తుల బ్యాగులను చెక్ చేయడం జరిగిందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు నగరంలో చోటు చేసుకోకూడని తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినట్లయితే సంబంధిత పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. అత్యవసర పరిస్థితులలో డయల్ 100ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## వేసవి శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

**జక్రాన్ పల్లి-నవభూమి:** రాష్ట్ర జాతీయ స్థాయిలో ఎంపికయ్యే విధంగా సమ్మర్ కోచింగ్ క్యాంప్ ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి ముత్తెన్న అన్నారు. జక్రాన్పల్లి మండలంలోని కలిగోట్ ఉన్నత పాఠశాలలో వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని ముత్తెన్న శుక్రవారం సందర్శించారు. జిల్లా యువజన క్రీడాశాఖ ఆధ్వర్యంలో కలిగోట్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వాలీబాల్ కోచింగ్ క్యాంపులో భాగంగా నేడు యువజన క్రీడ అధికారి ముత్తెన్న ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులకు వాలీబాల్, వాలీబాల్ నెట్టు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమ్మర్ వాలీబాల్ కోచింగ్ క్యాంపును సద్వినియోగం చేసుకొని రాబోయే రోజుల్లో రాష్ట్ర జాతీయ స్థాయిలో ఎంపికయ్యే విధంగా మెలుకువలు నేర్చుకోవాలని వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పురుషోత్తమాచారి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సువర్ణ, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయుడు



## రథోత్సవాలు.. మాజీ ఎమ్మెల్యేకు ఆహ్వానం



**మద్నూర్:-నవభూమి:** మద్నూర్ మండల కేంద్రంలో ఈ నెల 12, 13, రెండు రోజులపాటు నిర్వహించే శ్రీ లక్ష్మీ నారాయణ రథోత్సవాల ఉత్సవాల కార్యక్రమానికి హాజరు కావాలని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హనుమంతు షిండే ను శ్రీ లక్ష్మీనారాయణ ఆలయ కమిటీ శుక్రవారం ఆహ్వాన పత్రాన్ని అందజేసింది. ఈ ఆహ్వాన పత్ర అందజేత కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సందూర్వార్ హనుమాన్లు, గోశాల కమిటీ చైర్మన్ గాన్ల సంజయ్, ఆలయ కమిటీ వైస్ చైర్మన్ బండి లక్ష్మణ్, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు, మద్నూర్ సింగిల్ విండో మాజీ చైర్మన్ పాకల్ వార్ విజయ్ కుమార్, వీరితోపాటు ఆవార్వార్ హనుమాన్లు, సందూర్ వార్ అశోక్, తులసిరామ్, కత్గావ్ మాజీ సర్పంచ్ హనుమాన్లు, తదితరులు పాల్గొన్నారు.

## సెలవుల్లో ఉన్న జవాన్.. హుటాహుటిన విధుల్లోకి



**మద్నూర్-నవభూమి:** మద్నూర్ మండల కేంద్రానికి చెందిన బండి వార్ పరశురాం మిలటరీలో జవాన్ గా విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఈ మధ్యనే సెలవులపై ఇంటికి వచ్చాడు. అంతలోనే ఉన్నతాధికారులు అత్యవసర పరిస్థితుల దృష్ట్యా విధుల్లోకి చేరాలని పిలుపు రావడంతో హుటా హూటిన శుక్రవారం ఉదయం బయలుదేరి వెళ్లినట్లు జవాన్ కుటుంబ సభ్యులు తెలిపారు.

## ఘనంగా హెన్రి డునంట్ జయంతి వేడుకలు

**కంఠేశ్వర్-నవభూమి:** ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం అలాగే ప్రపంచ తలసీమియా దినోత్సవం పురస్కరించుకొని నిజామాబాదు జిల్లా రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ భవనంలో గురువారం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ బుస్స ఆంజనేయులు హెన్రి డునంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం మరియు తల సేమియా దినోత్సవం సందర్భంగా అందరికి శుభాకాంక్షలు తెలిపారు. అందరూ సమిష్టిగా సమైక్యతతో రెడ్ క్రాస్ సంస్థతో కలిసి నడవాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యంగా స్వచ్ఛంద సంస్థలు కలిసి నడిస్తే పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఇందుకు రెడ్ క్రాస్ సంస్థ ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరింత సేవలు పెరగాలన్న నగర ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు మానసవాదులు ముందుకు వచ్చి అండగా నిలవాలన్నారు. ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రాజశేఖర్ 84 వ సారి అలాగే రెడ్ క్రాస్ మెడికల్ ఆఫీసర్ డా అశ్విన్ కుమార్ రెడ్డి ,రామకృష్ణ రక్తదానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. అలాగే నిన్న బుధవారం బాల్ భవన్ లో జరిగిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన పిల్లలకు బహుమతులను అందచేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా రెడ్ క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్ ,జిల్లా కోశాధికారి కరిపే రవీందర్, నిజామాబాదు డివిజన్ చైర్మన్ డాక్టర్ శ్రీశైలం, వైస్ చైర్మన్ మురళి కృష్ణ ,జూనియర్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ డాక్టర్ అబ్బాపూర్ రవీందర్, యూత్ కోఆర్డినేటర్ మాణిక్యాల శ్రీనివాస్ ,ఎంసి మెంబర్లు శ్రీనివాస్ ,సోలమన్ ,బాబా శ్రీనివాస్, వెంకటేశ్వర్లు , డా రాజేష్ ,బొద్దుల రామకృష్ణ ,బాల్ భవన్ సూపెరిండెంటెంట్ ప్రభాకర్, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## సిఈఐఆర్ ద్వారా సెల్ ఫోన్ల రికవరీ



**కంఠేశ్వర్ -నవభూమి:** నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న 12 సెల్ ఫోన్లను రికవరీ చేసి బాధిత యజమానులకు అందజేసినట్లు నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ సాయి రెడ్డి శుక్రవారం తెలిపారు. ఎస్సై సాయి రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెలలో ట్రైన్ లలో సెల్ ఫోన్స్ పోగొట్టుకున్న వారి ఫోన్స్ లను సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా 12 ఫోనులను ట్రేస్ చేసి మొబైల్ యజమానులను పిలిపించి వారి ఫోన్స్ అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. ఇక ముందు కూడా ఎవరైనా ట్రైన్ లో టికెట్ ఉండి ఫోన్స్ పోగిట్టుకుంటే జి ఆర్ పి రైల్వే పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలన్నారు.

## షట్టర్ల వేలానికి స్పందన కరువు




**దుబ్బాక -నవభూమి:** మున్సిపాలిటీకి ఆదాయం సమకూర్చే కమర్షియల్ షట్టర్ల వేలానికి వ్యాపారస్తుల నుంచి స్పందన కరువైంది. స్పెషల్ ఆఫీసర్,అడిషనల్ కలెక్టర్ గరీమా అగ్రవాల్ ఆదేశాల మేరకు గురువారం దుబ్బాకలోని మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో 11 కమర్షియల్ షట్టర్ల కు వేలం ప్రక్రియ నిర్వహించారు. పోచమ్మ గుడి వద్ద గల 2 షట్టర్లకు గాను షాప్ నెంబర్ 4 ను మాత్రమే వేలం పాట ద్వారా డీ.కృష్ణవేణి దక్కించుకున్నారు. లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహం వద్ద నున్న మున్సిపల్ కాంప్లెక్స్ ఫస్ట్ ఫ్లోర్ లోని 6 షట్టర్లు, 2 బీహెచ్ కే సముదాయం వద్దనున్న నాలుగు షట్టర్లకు ఎలాంటి దరఖాస్తులు రాకపోవడం గమనార్హం. ఈ వేలం ప్రక్రియలో ఏఈ శ్రీకాంత్, సీనియర్ అకౌంటెంట్ అనిల్ రెడ్డి, జ్యోతి పలువురు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలకు భవనాల పరిశీలన

**బెజ్జంకి-నవభూమి:** హుస్నాబాద్‌లో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలను తిరిగి మండలానికి మార్చడానికి గురుకుల ఎస్సీ సాంఘిక సంక్షేమ పాఠశాల ప్రిన్సిపాల్ విజయ,వైస్ ప్రిన్సిపాల్ జ్యోతి,ఉపాధ్యాయురాలు స్వప్న గురువారం పర్యటించి మండల కేంద్రంలోని బాలికల, బాలుర ప్రభుత్వోన్నత పాఠశాల భవనాలను పరిశీలించినట్టు మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి తెలిపారు.ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రత్యేక చోరవచూపి గురుకుల సాంఘిక సంక్షేమ పాఠశాలను తిరిగి మండలానికి మార్చడానికి కృషి చేశారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్ వెల్లడించారు.ఏఎంసీ వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, ఆలయ చైర్మన్ జెల్లా ప్రభాకర్,డైరెక్టర్లు మల్లేశం,పులి సంతోష్,గ్రామ శాఖాధ్యక్షుడు బండిపల్లి రాజు, ఐలయ్య,రవి,రొడ్డ మల్లేశం,రావుల నర్సయ్య,రమేశ్ పాల్గొన్నారు.

